ప్రభాకర్‌రావు అరెస్టుకు ముగిసిన గడువు

ఇతర నిందితులను నేడు కోర్టులో హాజరుపర్చనున్న పోలీసులు

నాంపల్లి కోర్టులు, జూలై 25 (నమస్తే తెలంగాణ): ఫోన్ల ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడుగా ఉన్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు తోపాటు ఓ మీడియా సంస్థ ప్రతినిధి శ్రావణ్ కుమార్‌ను అరెస్టు చేసి, న్యాయస్థానంలో హాజరుపర్చాలని కోర్టు ఇచ్చిన గడువు గురువారంతో ముగిసింది. విదేశాల్లో ఉన్న వీరిద్దరితోపాటు ఈ కేసులోని ఇతర నిందితులందరినీ ఈ నెల 26న నాంపల్లి కోర్టులో తప్పనిసరిగా హాజరుపర్చాలని 12వ అడిషనల్ చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఈశ్వరయ్య గతంలో ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. కానీ, ప్రభాకర్‌రావు, శ్రావణ్ కుమార్ ఇప్పటికీ విదేశాల్లోనే ఉండటంతో పోలీస్ అధికారులకు ఏమీ పాలుపోవడం లేదు. దీంతో ఈ కేసులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న అదనపు ఎస్పీలు ప్రణీత్‌రావు, భుజంగరావు, తిరుపతన్న, హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ మాజీ అధికారి రాధాకిషన్‌రావును మాత్రమే శుక్రవారం కోర్టులో హాజరుపర్చనున్నారు. ఈ క్రమంలో ప్రభాకర్‌రావు, శ్రావణ్ కుమార్ అరెస్టు విషయమై పోలీసులు కోర్టుకు ఏమి సమాధానమిస్తారన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. కాగా, ఏసీపీ వెంకటగిరికి ఇటీవల ప్రభాకర్‌రావు రాసిన లేఖను కోర్టుకు నివేదించేందుకు ఆయన తరపు న్యాయవాది సిద్ధమవుతున్నారు.

పోలీసుల పిటిషన్‌పై నేడు విచారణ

రాధాకిషన్‌రావును మరో వారం రోజుల పాటు తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ జూబ్లీహిల్స్ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని నిందితుల తరపు న్యాయవాదిని కోర్టు ఆదేశించింది. ఆయన బెయిల్ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను ఆదేశించింది. ఈ రెండు పిటిషన్లపై శుక్రవారం విచారణ చేపడతామని కోర్టు స్పష్టం చేసింది.

నేడు 483 మంది ఫైర్‌మెన్‌ల పాసింగ్ పరేడ్

హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి, శ్రీధర్‌బాబు

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): 2022లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన 610 ఫైర్‌మెన్‌ల ఉద్యోగాల నోటిఫికేషన్‌కు ఎంపికైన 483 మంది ఫైర్‌మెన్‌లు నాలుగు నెలల శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. దీంతో శుక్రవారం వట్టినాగులపల్లిలోని అగ్నిమాపకశాఖ ట్రైనింగ్ అకాడమీలో వారికి పాసింగ్ ఔట్ పరేడ్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు హాజరుకానున్నట్టు అగ్నిమాపకశాఖ డీజీ వై నాగిరెడ్డి తెలిపారు. ట్రైనీలకు వరదలు, భూకంపాలు, విపత్తులు, అగ్ని ప్రమాదాలు, రోడ్డు, రైలు, విమాన ప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొనేలా శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు.

టెలిస్కోప్‌కు చిక్కిన 'సూపర్ జూపిటర్'

- **జేమ్స్ వెబ్ టెలిస్కోప్‌తో గుర్తింపు**
- **గురుగ్రహానికి ఆరు రెట్లు పెద్దది**

కేప్ కానావెరల్, జూలై 25: గురుగ్రహానికి ఆరు రెట్లు పెద్దదైన 'సూపర్ జూపిటర్'ను అంతర్జాతీయ పరిశోధకుల బృందం గుర్తించింది. నాసాకు చెందిన శక్తివంతమైన జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్‌ను ఉపయోగించి ఈ భారీ గ్రహానికి చెందిన కొన్ని చిత్రాలను తీసింది. ఇందుకు సంబంధించిన వివరాలు 'నేచర్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఈ గ్రహం తన నక్షత్రం చుట్టూ ఒక్కసారి తిరగడానికి దాదాపు 100 నుంచి 250 ఏండ్ల వరకు పడుతుందని పరిశోధకులు గుర్తించారు. భూమి, సూర్యుడి మధ్య ఉన్న దూరం కంటే ఈ గ్రహానికి, దాని నక్షత్రానికి మధ్య ఉన్న దూరం దాదాపు 15 రెట్లు అధికంగా ఉందని భావిస్తున్నారు. పూర్తిగా గ్యాస్‌తో తయారైన ఈ గ్రహ వాతావరణం భూవాతావరణానికి చాలా భిన్నంగా ఉండొచ్చని ఈ పరిశోధక బృందానికి నేతృత్వం వహించిన ఎలిసబెత్ మాథ్యూస్ తెలిపారు

వేశ్యా గృహం నిర్వహణకు రక్షణ కోరిన న్యాయవాది

దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మద్రాస్ హైకోర్టు

చెన్నై: వేశ్యా గృహాన్ని నడపటానికి రక్షణ కల్పించాలని ఓ న్యాయవాది కోరడంతో మద్రాస్ హైకోర్టు దిగ్భ్రాంతికి గురైంది. అడ్వకేట్ రాజా మురుగన్ హైకోర్టులో రెండు పిటిషన్లను దాఖలు చేశారు. వేశ్యా గృహాన్ని నిర్వహిస్తున్నందుకు పోలీసులు ఆయనపై నమోదు చేసిన కేసును రద్దు చేయాలని, కోరారు. విచారణకు చేపట్టిన జస్టిస్ పుగళేంది తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. వయోజనులు ఇష్టపూర్వకంగా సెక్స్ చేసుకునే హక్కుల ఆధారంగా తన చర్యలను సమర్థించుకుంటున్న పిటిషనర్ పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. న్యాయ శాస్త్ర డిగ్రీ సర్టిఫికెట్, బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్‌మెంట్ సర్టిఫికెట్‌లను సమర్పించాలని మురుగన్‌ను ఆదేశించింది.

నిధులు తెస్తరా? రాజీనామా చేస్తరా?

- **ఎనిమిది ఎంపీ సీట్లు ఇచ్చినా బీజేపీకి కృతజ్ఞత లేదా?**
- **ఏపీ, బీహార్‌కే కాదు అన్ని రాష్ట్రాలకు నిధులివ్వాలి**
- **రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల ఆగ్రహం**

సెక్యులర్ డెమోక్రటిక్ ఫోరం తెలంగాణ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్ జస్టిస్ బీ చంద్రకుమార్

ఖైరతాబాద్, జూలై 25: తెలంగాణ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి కూడా బడ్జెట్‌లో రూపాయి తెప్పించలేకపోయారని, అలాంటి వారికి పదవులున్నా, లేకున్నా ఒక్కటేనని వక్తలు ఆగ్రహం వ్యక్తంచేశారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ప్రధాని, ఆర్థిక, హోంశాఖ మంత్రులను కలిసి వారం పదిరోజుల్లో బడ్జెట్‌లో కేటాయింపులు చేయించాలని, ఒకవేళ ఒప్పించలేకపోతే పదవులకు రాజీనామా చేయడం ఉత్తమం అని సూచించారు. ఇద్దరు కేంద్రమంత్రులతో మిగిలిన ఆరుగురు బీజేపీ ఎంపీలు కూడా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సెక్యులర్ డెమోక్రటిక్ ఫోరం తెలంగాణ ఆధ్వర్యంలో జరిగిన రౌం టేబుల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ జస్టిస్ బీ చంద్రకుమార్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగ విలువలకు భిన్నంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. బడ్జెట్ అనేది రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ అని చెప్పారు. ఆంధ్రప్రదేశ్, బీహార్‌కే కాదు దేశంలోని అన్ని రాష్ట్రాలకు సమానంగా, అవసరాలకు అనుగుణంగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాజకీయ అధికారం నిలబెట్టుకోవడం కోసం, కొన్ని పార్టీలను తృప్తి పర్చడం కోసం బడ్జెట్‌లో కేటాయింపులు చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. తమ ప్రభుత్వానికి మద్దతిచ్చిన పార్టీలకే ఎక్కువ చేస్తామంటే, చేయక తప్పదంటే తమ పదవులకు రాజీనామా చేసి మరోసారి ఎన్నికలకు పోవాలని సవాల్ చేశారు. 1956 నుంచి తెలంగాణకు అన్యాయం జరుగుతూనే ఉన్నదని, నీళ్లు, నిధులు, ఉద్యోగాల విషయంలో తీరని అన్యాయం జరిగిందని వివరించారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ తీరని కలగానే మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణకు బడ్జెట్‌లో కేటాయింపులు ఇవ్వకుండా వివక్ష చూపారని మండిపడ్డారు. తెలంగాణ ప్రజలు 8 పార్లమెంట్ సీట్లు ఇచ్చినా బీజేపీకి కృతజ్ఞత లేదా? అని ప్రశ్నించారు. సమావేశంలో ఓటీనీడ్ గ్యారెంటీ అధ్యక్షురాలు సొగరా బేగం, నాగరాజు, గోవర్ధన్, నర్సింహ పాల్గొన్నారు.

మొక్కల పెంపకానికి చేపట్టిన చర్యలేమిటి?

రాష్ట్రప్రభుత్వం నుంచి నివేదిక కోరిన హైకోర్టు

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): వర్షాకాలంలో మొక్కల పెంపకానికి చేపట్టిన చర్యలేమిటో నివేదించాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. జనాభాకు తగ్గట్టుగా మొక్కలను, పచ్చదనాన్ని పెంచడం లేదని, పార్కులకు కేటాయించిన స్థలాలను రక్షించేలా ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్ కుమార్ గురువారం విచారణ జరిపింది. రాష్ట్రవ్యాప్తంగా 749 హెక్టార్లలో లక్షల మొక్కలను నాటేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని, స్థానిక సంస్థలను భాగస్వాములను చేస్తామని అదనపు అడ్వకేట్ జనరల్ మహమ్మద్ ఇమ్రాన్‌ఖాన్ తెలిపారు. సమగ్ర వివరాలను తెలియజేసేందుకు గడువు కావాలని కోరారు. దీంతో తదుపరి విచారణను ఆగస్టు 1కి వాయిదా వేస్తున్నామని, ఆలోగా నివేదించాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

ఉద్యానవర్సిటీకి 'ప్రభుత్వ తెగులు'

- **నామమాత్రంగా మారిన కీలక విభాగాలు**
- **కనిపించని కూరగాయల సాగు విభాగం**
- **పైరవీల్లో మునిగిపోయిన ఉన్నతాధికారులు**

వ్యవసాయ యూనివర్సిటీ, జూలై 25: రాష్ట్ర ఉద్యాన వర్సిటీకి 'ప్రభుత్వ తెగులు' పట్టింది. ఆ వర్సిటీలోని కూరగాయలు, ఔషధ మొక్కలు, పండ్లు, పూల సాగు విభాగాలను వ్యవసాయ వర్సిటీ నుంచి ఉద్యాన కళాశాల ఆవరణలోకి మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినప్పటికీ అందుకు అవసరమైన స్థలాన్ని, కార్యాలయాల నిర్మాణానికి కావాల్సిన నిధులను కేటాయించకపోవడమే ఇందుకు కారణం. దీంతో ప్రస్తుతం ఆ విభాగాలు నామమాత్రపు సిబ్బందితో పేరుకే కొనసాగుతున్నాయి. ఆ విభాగాల ఉన్నతాధికారులు విధులకు ఎగనామం పెట్టి, పైరవీల కోసం అధికార పార్టీ నాయకుల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. దీంతో విత్తనాలతోపాటు వ్యవసాయ సమాచారం కోసం వచ్చిన రైతులు నిరాశతో వెనుదిరగాల్సి వస్తున్నది. దీనిపై కూరగాయల విభాగం హెడ్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ అనితా కుమారిని సంప్రదించడంతో.. తమ కార్యాలయ తరలింపునకు అవసరమైన స్థలాన్ని, నిధులను ప్రభుత్వం ఇంకా కేటాయించలేదని, ప్రస్తుతానికి తమ కార్యాలయాన్ని తాత్కాలికంగా నడిపేందుకు ఉద్యాన కళాశాలలోని ఓ గదిని మాత్రమే కేటాయించారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈసారి కూరగాయల నర్సరీని కూడా ఏర్పాటు చేయలేదని చెప్పారు.

ఆప్‌కు కొత్త ఆఫీస్ కేటాయింపు

న్యూఢిల్లీ, జూలై 25: ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు ఆప్‌కి ఢిల్లీలోని లుటియెన్స్ ప్రాంతంలో కొత్త కార్యాలయాన్ని కేటాయించినట్టు ఆ పార్టీ వర్గాలు గురువారం వెల్లడించాయి. పండిట్ రవిశంకర్ శుక్లా మార్గంలోని బంగ్లా 1లో ఆప్ కొత్త ఆఫీస్ కొలువుదీరనుంది. గతంలో రౌస్ అవెన్యూలో ఆప్ కార్యాలయం ఉండేది. ఆప్‌కు వచ్చిన జాతీయ పార్టీ హోదాను గుర్తిస్తూ ఆ పార్టీకి ఆఫీస్ స్థలం కేటాయించడంపై గురువారం లోగా నిర్ణయం తీసుకోవాలని ఢిల్లీ హైకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది.

ఒడిశా అసెంబ్లీలో పోలవరం లొల్లి

భువనేశ్వర్, జూలై 25: ఆంధ్రప్రదేశ్‌లో నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టుపై ఒడిశా అసెంబ్లీలో కాంగ్రెస్ సభ్యులు గురువారం నిరసనకు దిగారు. ఈ ప్రాజెక్టు కారణంగా మల్కన్‌గిరిలోని గిరిజనుల భూమి నీట మునిగిపోయే ప్రమాదం ఉందని కాంగ్రెస్ ఆందోళన వ్యక్తం చేసింది. ఆ పార్టీ సభ్యులు స్పీకర్ వద్దకు దూసుకువచ్చి నినాదాలు చేయడంతో తీవ్ర గందరగోళం ఏర్పడింది. ఈ సందర్భంగా పోలవరంపై వెంటనే ఒక హౌస్ కమిటీని వేయాలని సీఎల్పీ నేత రామ చంద్ర కాదమ్ డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సహకారం అందిస్తున్నదని, కానీ ఈ ప్రాజెక్టు కారణంగా మల్కన్‌గిరి జిల్లాలో 1400 నుంచి 1500 హెక్టార్ల భూమి నీట మునిగిపోతుందని చెప్పారు. దీనిపై స్పీకర్ స్పందించకపోవడంతో కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి నినాదాలు చేశారు.

అంతరిక్షంలోకి 4కే వీడియో ప్రసారాలు

- **తొలిసారి పంపిన 'నాసా'**

న్యూఢిల్లీ, జూలై 25: లేజర్ కమ్యునికేషన్ టెక్నాలజీని ఉపయోగించి 'నాసా' మొట్టమొదటి సారి అంతరిక్షంలోకి 4కే వీడియో ప్రసారాలను చేయగలిగింది. ఆకాశంలోని ఓ ఎయిర్‌క్రాఫ్ట్ నుంచి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్), తిరిగి అక్కడ్నుంచి.. ఈ వీడియో ప్రసారాలను భూమిపైకి చేపట్టడంలో నాసా సక్సెస్ అయ్యింది. 'ఆర్టెమిస్ మిషన్స్'లో భాగంగా చంద్రుడిపైకి నాసా వ్యోమగాముల్ని పంపబోతున్నది. ఇందుకు సంబంధించి ప్రత్యక్ష ప్రసారాలు తాజా ప్రయోగంతో సాధ్యమవుతాయని నాసా సైంటిస్టులు చెబుతున్నారు. భవిష్యత్తులో 4కే హెచ్‌డీ వీడియో ప్రసారాలు సాధ్యమేనని 'నాసా' ఇంజినీర్ల బృందంలోని సైంటిస్టు డానియల్ రాయిబల్ చెప్పారు. వ్యోమగాముల ఆరోగ్యం, కార్యచరణను సమన్వయం చేయడానికి ఈ ప్రత్యక్ష ప్రసారాలు కీలకమవుతాయని అన్నారు.

పడవ బోల్తా.. 15 మంది మృతి

- **150 మంది గల్లంతు**

అబుజ, జూలై 25: యూరప్‌కు వెళుతున్న ఆఫ్రికన్ వలసదారుల పడవ బోల్తా పడటంతో 15 మంది మృతి చెందారు. 150 మంది గల్లంతయ్యారు. సోమవారం మారిటానియా రాజధాని నౌవక్‌చోట్ వద్ద ఈ ప్రమాదం జరిగింది. పడవలో మొత్తం 300 మంది ప్రయాణిస్తున్నారని అంతర్జాయ వలస సమాఖ్య తెలిపింది. మౌరిటానియా తీర రక్షక దళం 120 మందిని రక్షించింది. గల్లంతైనవారి కోసం గాలింపు కొనసాగుతున్నది. అభద్రత, పేదరికం కారణంగా ఆఫ్రికన్ వలసదారులు యూరప్ వలస వెళ్లడానికి ప్రయత్నిస్తున్నారు.

ఇద్దరు ఎమ్మెల్యేలపై జార్ఖండ్ స్పీకర్ వేటు

రాంచీ: జార్ఖండ్ శాసనసభ సభాపతి ట్రైబ్యునల్ ఎమ్మెల్యేలు లోబిన్ హెమ్‌బ్రోమ్ (జేఎంఎం), జై ప్రకాశ్ భాయ్ పటేల్ (కాంగ్రెస్)ను శాసన సభ్యత్వానికి అనర్హులుగా ప్రకటించింది. ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం చెప్పిన ఈ తీర్పు ఈ నెల 26 నుంచి అమల్లోకి వస్తుందని వివరించింది. హెమ్‌బ్రోమ్‌పై జేఎంఎం, పటేల్‌పై బీజేపీ ఫిర్యాదులపై ఈ నిర్ణయం వెలువడింది. వర్షాకాల సమావేశాలు శుక్రవారం ప్రారంభమవుతున్న తరుణంలో వీరిపై వేటు పడింది.

వాణిజ్య

రియల్ పన్ను పోటు



స్థిరాస్తి క్రయవిక్రయాలకు దెబ్బ • బడ్జెట్‌లో ఇండెక్సేషన్ బెనిఫిట్ దూరం

పెరిగిన ఎల్‌టీసీజీ పన్ను భారం • నిర్మాణ రంగానికి నష్టమేనంటున్న నిపుణులు

మధ్యతరగతి సొంతింటి కలల్ని కేంద్ర ప్రభుత్వం తెచ్చిన బడ్జెట్ చెరిపేసింది. ఇండెక్సేషన్ ప్రయోజనాన్ని తొలగించి మోయలేనంత పన్ను భారాన్ని మోదీ సర్కారు మోపింది మరి. స్థిరాస్తి క్రయవిక్రయాలను ఆందోళనకరం చేస్తూ తీసుకున్న ఈ నిర్ణయంపట్ల నిర్మాణ రంగ పరిశ్రమ భగ్గుమంటున్నదిప్పుడు.

న్యూఢిల్లీ, జూలై 25: కరోనా ప్రభావం నుంచి నెమ్మదిగా బయటపడిన స్థిరాస్తి రంగం.. మళ్లీ మందగమనంలోకి వెళ్లనుందా? బడ్జెట్‌లో మోపిన పన్ను భారంతో క్రయవిక్రయాలు పడిపోనున్నాయా? ధరలు పెరిగి సామాన్యుల సొంతింటి కలలు చెదిరిపోతాయా?.. దేశీయ నిర్మాణ రంగాన్ని ఇప్పుడు కుదిపేస్తున్న ప్రశ్నలివే. అవును.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను లోక్‌సభలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్.. రియల్ ఎస్టేట్ ఇండస్ట్రీని ఒక్కసారిగా షాక్‌కు గురిచేసింది మరి.

ఇదీ సంగతి..

పార్లమెంట్‌లో ఈ నెల 23న (మంగళవారం) ప్రకటించిన వార్షిక బడ్జెట్‌లో స్థిరాస్తులు, ఇతర ఆర్థిక, ఆర్థికేతర ఆస్తుల అమ్మకాలపై ఇండెక్సేషన్ బెనిఫిట్స్‌ను తొలగిస్తున్నట్టు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. దీంతో రియల్ ఎస్టేట్ రంగంపై ఇది తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని ఇప్పుడు మెజారిటీ ఇండస్ట్రీ నిపుణులు విశ్లేషిస్తున్నారు. లాంగ్-టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ (ఎల్‌టీసీజీ లేదా దీర్ఘకాల మూలధన లాభాలు) పన్నుకు ఇండెక్సేషన్ ప్రయోజనాన్ని తీసేస్తున్నట్టు విత్త మంత్రి వెల్లడించారు. అలాగే ఎల్‌టీసీజీ ట్యాక్స్‌ను 12.5 శాతానికి తగ్గిస్తున్నట్టూ చెప్పారు. ఇంతకుముందు ఇండెక్సేషన్ ప్రయోజనంతో 20 శాతంగా ఉండేది. అయితే గతంతో పోల్చితే పన్ను శాతం దాదాపు సగానికి తగ్గినా.. ఇండెక్సేషన్ బెనిఫిట్‌ను దూరం చేయడం వల్ల స్థిరాస్తి అమ్మకం దారులపై ట్యాక్స్ భారం ఇంకా పెరుగుతుండటమే ఇప్పుడు అందరి ఆందోళనకు కారణమవుతున్నది. ముఖ్యంగా రీ-సేల్ మార్కెట్ కుదేలవుతుందన్న అభిప్రాయాలున్నాయి.

ఇండెక్సేషన్ బెనిఫిట్ అంటే?

2001 తర్వాత కొన్న ఇండ్లను ఇప్పుడు అమ్మితే.. కొనుగోలు చేసిన ధరపై వచ్చిన లాభానికి ఇండెక్సేషన్ బెనిఫిట్ లేకుండా ఎల్‌టీసీజీ పన్ను 12.5 శాతం వర్తిస్తుందని బడ్జెట్‌లో మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. అయితే అంతకుముందు (2001 మార్చి 31 లోపు) కొన్న ఇండ్లను అమ్ముకుంటే మాత్రం ఇండెక్సేషన్ ప్రయోజనం ఉంటుంది. ఇండెక్సేషన్ బెనిఫిట్‌ను కాస్ట్ ఇన్‌ఫ్లేషన్ ఇండెక్స్ (సీఐఐ) నంబర్ల ఆధారంగా లెక్కిస్తారు. 2001-02 నుంచి (2001 ఏప్రిల్ నుంచి) ప్రతీ ఆర్థిక సంవత్సరం ఈ సీఐఐ నంబర్‌ను ఆదాయ పన్ను (ఐటీ) శాఖ విడుదల చేస్తూ వస్తున్నది. 2001-02లో నాటి ద్రవ్యోల్బణం ఆధారంగా ఇది 100గా ఉన్నది. ఈ బేస్ రేటు (100)నే 2001 కంటే ముందు ఇండ్లు కొన్నవారికి ఇండెక్సేషన్ బెనిఫిట్ లెక్కింపునకు వాడుతున్నారు. ఇక ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) ఇప్పటి ద్రవ్యోల్బణం రేటు ప్రకారం సీఐఐని 363గా నిర్ణయించారు. దీని ప్రకారం 2001-02 ఆర్థిక సంవత్సరంలో మీరు లక్ష రూపాయలకు ఇల్లు కొంటే.. ప్రస్తుతం దాని విలువ రూ.3.63 లక్షలు అన్నమాట. ఇంతకు మించిన ధరకు ఇల్లును మీరు అమ్ముకుంటే అందులో సదరు రూ.3.63 లక్షలుపోను మిగతా మొత్తానికే ఎల్‌టీసీజీ పన్ను చెల్లించాల్సి ఉంటుంది. దీన్నే ఇండెక్సేషన్ బెనిఫిట్ అంటారు. అయితే ఇది పాత పన్ను ప్రకారం. తాజా బడ్జెట్‌లో చేసిన మార్పుల ప్రకారం ఇంటిని అమ్ముకున్న ధరలో నుంచి కొన్న ధర లక్ష మాత్రమే తీసేస్తారు. మిగతా మొత్తం అంతటికీ పన్ను పడుతుంది.



పాత పన్ను ప్రకారం

2018-19లో రూ.50 లక్షలతో రాజేశ్ ఓ ఇంటిని కొనుగోలు చేశారు. ఆ ఆర్థిక సంవత్సరానికిగాను సీఐఐ 280గా ఉన్నది. 2024-25లో రాజేశ్ ఆ ఇంటిని రూ.70 లక్షలకు అమ్మేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సీఐఐ 363గా ఉన్నది. దీంతో ఇంటిని అమ్మిన ఆర్థిక సంవత్సరం సీఐఐతో.. ఇంటిని కొన్న ఆర్థిక సంవత్సరం సీఐఐని భాగించడం జరుగుతుంది. 363/280=1.296428 వస్తుంది. దీన్ని ఇంటిని కొన్న ధర రూ.50 లక్షలతో గుణిస్తే.. రూ.64,82,142గా ఉంటుంది. ఇంటిని అమ్మడం ద్వారా వచ్చిన రూ.70 లక్షల్లో నుంచి ఈ రూ.64,82,142ను తీసేయాలి. అప్పుడు రూ.5,17,858 వస్తుంది. దీనిపై ఎల్‌టీసీజీ పన్ను 20 శాతం అంటే రూ.1,03,571.6 చెల్లిస్తే సరిపోతుంది.

కొత్త పన్ను ప్రకారం

అమ్మిన ధర రూ.70 లక్షల నుంచి కొన్న ధర రూ.50 లక్షలను తీసేస్తే.. మిగిలే ఆ రూ.20 లక్షలపై 12.5 శాతం ఎల్‌టీసీజీ పన్ను చెల్లించాలి. అంటే రూ.2.50 లక్షలు చెల్లించాలి. ఎల్‌టీసీజీకి ఇండెక్సేషన్ బెనిఫిట్‌ను తొలగించడం వల్ల గతంతో పోల్చితే ఇంటి అమ్మకంపై సుమారు రూ.1.47 లక్షలు అదనంగా ట్యాక్స్‌పేయర్లు చెల్లించాల్సి వస్తున్నదన్నమాట.

ఇండస్ట్రీ వర్గాల ఆందోళనలివీ..

- **ఇండెక్సేషన్ బెనిఫిట్‌ను తాజా బడ్జెట్‌లో తీసేయడం వల్ల రీసేల్ మార్కెట్ లావాదేవీలు మందగిస్తాయి.**
- **ఎప్పుడో కొన్న ఇండ్లు, భూములను ఇప్పుడు అమ్మేందుకు వాటి యజమానులు పన్ను భారం కారణంగా ఆసక్తి చూపరు.**
- **కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో అమ్మకందారులకు పన్ను భారం పెరిగి లాభాలు తగ్గుతాయి.**
- **పన్నుల కారణంగా స్థిరాస్తి ధరలను అమ్మకందారులు అమాంతం పెంచేస్తారు. దీనివల్ల కొనుగోలుదారులు ముందుకురాని దుస్థితి నెలకొంటుంది.**
- **పన్నుల్ని తప్పించుకోవడానికి నగదు లావాదేవీలనే అంతా ఎంచుకుంటారు. ఇది ప్రభుత్వ ఖాజానాకు, నిర్మాణ రంగానికి కూడా నష్టం.**
- **కొత్త పెట్టుబడులు రాక నిర్మాణ ప్రాజెక్టులు ఎక్కడివక్కడే ఆగిపోయే ప్రమాదం.**
- **ఇండెక్సేషన్ ప్రయోజనాన్ని తొలగించడం వల్ల రియల్టీలోకి బ్లాక్‌మనీ రాక పెరుగుతుంది.**

మరో 1,000 తగ్గిన బంగారం ధర

- **3 రోజుల్లో రూ.5,000 పతనం**
- **హైదరాబాద్‌లో రూ.70 వేల దిగువకు తులం రేటు**

న్యూఢిల్లీ, జూలై 25: బంగారం ధరలు భారీగా దిగొస్తున్నాయి. గురువారం తులం రేటు మరో రూ.1,000కిపైగా పడిపోయింది. దీంతో 24 క్యారెట్ 10 గ్రాముల విలువ హైదరాబాద్‌లో రూ.70 వేల దిగువకు చేరి రూ.69,820గా నమోదైంది. బుధవారంతో చూస్తే రూ.1,040 తగ్గింది. ఇక 22 క్యారెట్ రూ.950 దిగి రూ.64,000గా ఉన్నది. ఢిల్లీలో మాత్రం రూ.70,650 వద్ద స్థిరపడింది. ఇక్కడ అంతకుముందు రెండు రోజుల్లో రూ.4,000 దిగజారగా.. మొత్తం ఈ మూడు రోజుల్లో రూ.5,000 పతనం కావడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్లలో ధరల క్షీణత, నగల వర్తకులు అమ్మకాల ఒత్తిడికి లోనవడంబులియన్ మార్కెట్‌ను దిగువ ముఖం పట్టిస్తున్నాయి. మరోవైపు కిలో వెండి ధర కూడా ఢిల్లీలో రూ.3,500 తగ్గి రూ.84,000గా ఉన్నది. హైదరాబాద్‌లో రూ.84,500 పలుకుతున్నది. బడ్జెట్‌లో బంగారం, వెండిపై కస్టమ్స్ సుంకాలకు కోత పెట్టడంతో.. ఒక్కసారిగా బయ్యర్లు, ఇన్వెస్టర్లు రివర్స్‌గేర్ వేశారు. కాగా, గ్లోబల్ మార్కెట్‌లో ఔన్సు బంగారం 2361 డాలర్లు పలికితే.. వెండి 28.04 డాలర్లుగా నమోదైంది.

ఐడీబీఐ అమ్మకానికి అంతా సిద్ధం

- **త్వరలో ఆర్బీఐ నుంచి గ్రీన్‌సిగ్నల్**

న్యూఢిల్లీ, జూలై 25: ప్రభుత్వ రంగ సంస్థ, ఐడీబీఐ బ్యాంక్ ప్రైవేటీకరణకు లైన్ క్లియరవుతున్నది. బ్యాంక్‌ను చేజిక్కించుకొనేందుకు వీలున్న మదుపరులకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నుంచి కావాల్సిన భద్రతాపరమైన అనుమతులు వచ్చేశాయి. ఈ మేరకు గురువారం సంబంధిత అధికారి ఒకరు పీటీఐకి తెలిపారు. అలాగే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నుంచి కూడా అనుమతి త్వరలోనే వస్తుందన్నారు. కాగా, ఐడీబీఐలో ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ 30.24 శాతం, కేంద్ర ప్రభుత్వం 30.48 శాతం వాటాలను అమ్మేయనున్నాయి. ఈ బ్యాంక్‌లో కేంద్రానికి, ఎల్ఐసీకి కలిపి మొత్తం 94.72 శాతం వాటా ఉన్నది.

కెనరా బ్యాంక్ లాభం 3,905 కోట్లు

తొలి త్రైమాసికంలో 10 శాతం వృద్ధి

న్యూఢిల్లీ, జూలై 25: ప్రభుత్వరంగ సంస్థ కెనరా బ్యాంక్ రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికపు నికర లాభంలో 10 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. 2022-23